

దుర్గాదేవి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



నిర్మల్ రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణంలోని రాంనగర్‌లో ఆషాడ బోనాల సందర్భంగా దుర్గాదేవి ఆలయంలో బీజేఎల్పీనేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రత్యేకపూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, నాయకులు రావుల రాంనాథ్, సత్యనారాయణగౌడ్‌తో పాటు పట్టణ బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహాలక్ష్మి పండగ

చల్ల ముంతలతో అమ్మవారికి గంగపుత్రుల మొక్కుల చెల్లింపు



గొల్లెనతో అమ్మవారి ఆలయానికి బయలుదేరిన గంగపుత్రులు

ఖానాపూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో మహాలక్ష్మి పండగ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం పట్టణ పురవీధుల్లో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గొల్లెన, చల్ల ముంతల ఊరేగింపును అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి చల్ల ముంతలను సమర్పించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ చల్ల ముంతల ఊరేగింపు కార్యక్రమానికి మహిళలు భారీగా తరలివచ్చారు. అంతకుముందు ఇంద్రానగర్‌లోని గంగపుత్ర సంఘ భవనంలో గొల్లెన, చల్ల ముంతలు అన్ని ఒక్కచోట ఉంచి పూజలు నిర్వహించి అక్కడి నుంచి ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి గంగపుత్రులు బయలుదేరి వెళ్లారు.



అమ్మవారికి మొక్కులు చెల్లించేందుకు
చల్ల ముంతలతో తరలివెళ్తున్న గంగపుత్ర సంఘం మహిళలు

జనగామ ఎమ్మెల్యేకి జాన్సన్ పరామర్శ

ఖానాపూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ప్రమాదవశాత్తు కిందపడి గాయపడిన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని శుక్రవారం బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ పరామర్శించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని పల్లా రాజేశ్వర్‌రెడ్డి నివాసంలో ఆయనను కలిసిన జాన్సన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నట్లు ఆంధ్రజ్యోతికి ఫోన్ ద్వారా తెలిపారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం



ముఖ్య కార్యకర్తలతో సమావేశమైన నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి (ఫైల్)



- సమరానికి సై అంటున్న రాజకీయ పార్టీలు
- షెడ్యూల్ కోసం ఎదురుచూపులు
- పట్టు నిలుపుకునేందుకు ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ముందస్తు ప్రణాళికలు
- ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ పార్టీ
- పునర్ వైభవం కోసం బీఆర్ఎస్ ఆరాటం

నిర్మల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : కొద్దిరోజుల్లోనే స్థానిక ఎన్నికలు జరగనున్నట్లు స్పష్టమైన సంకేతాలు వెలువడుతున్న నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ఆ దిశగా సిద్ధమవుతున్నాయి. ఈ ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ జారీ కోసం పార్టీలు ఎదురుచూస్తున్నాయి. కాగా ఈ సారి జరిగే ఎన్నికలు ప్రధానంగా మూడు పార్టీలకు సవాలుగా మారబోతున్నాయి. జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థానిక ఎన్నికలను ఆయా పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకునే అవకాశాలున్నాయి. దీంతో స్థానిక ఎన్నికల సమయం పల్లెల్లో హోరెత్తబోతోంది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఈ సారి జరిగే స్థానిక ఎన్నికల్లో పోటాపోటీగా తలపడనున్నాయి. అయితే మొన్నటి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో చావుదెబ్బ తిన్న బీఆర్ఎస్ పార్టీ ఈ ఎన్నికల ద్వారా తన ఉనికిని కాపాడుకునే ప్రయత్నాలు చేయనుందని అంటున్నారు. ఇప్పటికే నాయకులు కార్యకర్తల కొరతతో సతమతమవుతున్న బీఆర్ఎస్ పార్టీ కనీసం స్థానిక ఎన్నికల్లో కొన్ని స్థానాలనైనా కైవసం చేసుకొని తన మనుగడను కాపాడుకునే ప్రయత్నం చేసే అవకాశాలున్నాయని అంటున్నారు. అయితే స్థానిక ఎన్నికల కోసం మూడు ప్రధాన పార్టీలు సిద్ధమవుతుండడంతో ఈ సారి ఈ ఎన్నికల ఘట్టం రసవత్తరంగా మారనుందని అంటున్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి మాత్రం ఈ ఎన్నికలు ఛాలెంజ్‌గా మారబోతున్నాయని చెబుతున్నారు. ఇప్పటికే పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఆ పథకాల ద్వారా గెలుపు సాధించేందు కోసం వ్యూహరచనలు చేయబోతోంది. అయితే ఓటర్లలో హిందుత్వ సెంటిమెంట్ బలంగా పెరుగుతున్న కారణంగా స్థానిక ఎన్నికల్లో ఎలాగైనా గెలుపు సాధించి ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగేందు కోసం బీజేపీ ఇప్పటి నుంచే సిద్ధమవుతోందంటున్నారు. కాగా నాయకత్వ కొరతతో సతమతమవుతున్న బీఆర్ఎస్ తిరిగి పుంజుకునేందుకు ఈ ఎన్నికలను వేదికగా చేసుకోవాలని భావిస్తోంది. ఇలా మూడు పార్టీలు ఎవరికి వారే తమ సత్తా చాటుకునే ప్రయత్నం చేయబోతుండడంతో రాజకీయాలు ఆసక్తికరంగా మారనున్నాయి.

కాంగ్రెస్‌కు ప్రతిష్ఠాత్మకం

అధికార కాంగ్రెస్ పార్టీకి స్థానిక ఎన్నికలు అత్యంత ప్రతిష్ఠాత్మకం కాబోతున్నాయి. బీజేపీ, బీఆర్ఎస్‌ల తప్పుడు ప్రచారం అలాగే ప్రతీరోజూ చేస్తున్న విమర్శలకు ఈ ఎన్నికల్లో గెలుపు సాధించి ఈ రెండు పార్టీలకు చెక్ పెట్టాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. దీనికి అనుగుణంగానే జిల్లాలోని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఇప్పటికే పలు దఫాలుగా వివిధ అంశాలపై సూచనలు కూడా ఇచ్చారు. ఆ పార్టీ పరిశీలకులు పలుసార్లు జిల్లాలో పర్యటించి నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం ఉండేట్లు ప్రయత్నించారు. విభేధాలు పక్కన పెట్టి గెలుపు కోసమే పని చేయాలని పరిశీలకులు ఇప్పటికే నేతలకు సూచించారు. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఈ ఎన్నికల్లో ప్రధాన అస్త్రంగా మలుచుకోబోతోంది. కార్యకర్తలందరు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకువెళ్లి వారి మద్దతును కూడగట్టాలన్నదే టార్గెట్‌గా పెట్టుకోబోతున్నారు. జిల్లాలోని ముఖ్య నాయకులందరికీ ఇప్పటికే పార్టీ అధిష్ఠానం ఆ దిశగా సంకేతాలు అందించింది. అధికారంలో ఉన్న కారణంగా కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికలను సవాలుగా తీసుకునే అవకాశాలున్నాయని అంటున్నారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో పాటు డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు, మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నారాయణరావు పటేల్, విఠల్‌రెడ్డి తదితరులు తమ తమ పరిధిలో కేడర్‌ను స్థానిక ఎన్నికల వైపు మళ్లించేందుకు ఇప్పటికే సిద్ధమయ్యారు. మొత్తానికి కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో సత్తా చాటి బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు తన సత్తాను చూపాలని భావిస్తున్నట్లు పేర్కొంటున్నారు.

సెంటిమెంట్ అస్త్రంగా బీజేపీ

ఆపరేషన్ సింధూర్ సక్సెస్ కావడం అంతటా హిందుత్వ సెంటిమెంట్ బలంగా విస్తరిస్తుండడాన్ని బీజేపీ తనకు అనుకూలంగా మలుచుకోవాలని భావిస్తోంది. ఈ మేరకు బీజేఎల్పీ నేత ఏలేటీ మహేశ్వర్‌రెడ్డి , ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు రితేష్‌రాథోడ్‌లు ఇప్పటికే పలు దఫాలుగా సమావేశమై స్థానిక ఎన్నికలపై చర్చించడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో అమలవుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలతో పాటు హిందుత్వ సెంటిమెంట్‌ను ఈ సారి ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లి అత్యధిక స్థానాలు సాధించాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. గత వారం రోజుల క్రితం బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మూడు నియోజకవర్గాల్లోని ఆ పార్టీ నేతలందరితో రహస్య సమావేశాలు నిర్వహించి ఎన్నికల వ్యూహాలను వారికి వివరించినట్లు సమాచారం. అయితే ఈ సమావేశానికి సంబంధించి సమాచారం లీక్ కాకుండా మహేశ్వర్‌రెడ్డితో పాటు ఆ పార్టీ నేతలంతా జాగ్రత్త పడడం చర్చనీయాంశంగా మారుతోంది. ఈ సారి అధికార కాంగ్రెస్ పార్టీని ఓడించి తన బలాన్ని మరోసారి నిరూపించుకోవాలని బీజేపీ చేస్తున్న ప్రయత్నాలపై అంతటా ఆసక్తి నెలకొంటోంది.

అస్తిత్వం కోసం బీఆర్ఎస్ ఆరాటం

మొన్నటి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలతో పూర్తి జవసత్వాలు కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీ కనీసం ఈ స్థానిక ఎన్నికల్లోనైనా కొంతమేర ప్రభావం చూపి తన అస్తిత్వాన్ని నిలుపుకోవాలని ప్రయత్నించనుందని అంటున్నారు. ఇప్పటికే ఆ పార్టీకి సరియైన నాయకత్వం లేక కేడర్ అంతా తలోదిక్కుగా చీలిపోయారు. అయితే అధికార కాంగ్రెస్, బీజేపీల్లోని అసంతృప్తి వాదులను, తటస్థంగా వ్యవహరిస్తున్న నాయకులు, కేడర్‌ను తిరిగి తమ వైపునకు తిప్పుకొని పార్టీని తిరిగి పునర్ వైభవం కోసం బీఆర్ఎస్ ఇప్పటి నుంచే ప్రయత్నాలు మొదలుపెట్టింది. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు గట్టి పోటీనిచ్చి తిరిగి తన పట్టును పెంచుకునే ప్రయత్నాలను ఆ పార్టీ చేపట్టనుందని అంటున్నారు.



అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు చేరేలా చర్యలు

- సోనియానే తెలంగాణ ఇచ్చారు
- ముమ్మాటికీ ఆ ఘనత కాంగ్రెస్‌దే
- రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు



ఇందిరమ్మ లబ్ధిదారులకు పట్టాలను అందజేస్తున్న మంత్రి జూపల్లి



మంత్రి జూపల్లికి గజమాలతో స్వాగతం

నిర్మల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికి అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రొహిబిషన్, ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తుశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. కలెక్టర్ అభిలాష అభినవ్ మంత్రికి పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు. మంత్రి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన నిరుపేదలందరికీ చేరేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. ప్రతి నియోజకవర్గానికి 3,500ల చొప్పున ఇందిరమ్మ ఇళ్ల కేటాయించారని, దశల వారీగా ప్రతి లబ్ధిదారుడికి దశల వారీగా ప్రతీ లబ్ధిదారుడికి ఇళ్లు అందేలా చర్యలు చేపడతామని తెలిపారు. జిల్లాలో రైతుభరోసా పథకం 100 శాతం అమలైందని వెల్లడించారు. అలాగే పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు ఎరువులు, విత్తనాలు సకాలంలో అందించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానంతో ప్రభుత్వపాలన మరింత పారదర్శకంగా, వేగవంతంగా అమలు చేయనున్నట్లు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో అన్ని ప్రభుత్వ పథకాలను అర్హులైన పేదలందరికీ చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అన్ని పథకాలు పారదర్శకంగా ప్రజలకు అందిస్తున్నామన్నారు. జిల్లాలో వికలాంగుల సౌకర్యార్థం అలిమ్కో సంస్థ ద్వారా రూ. 1.21 కోట్లు విలువ చేసే ఉపకరణాలను పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేశామని తెలిపారు. ప్రభుత్వ విద్యను ప్రోత్సహించేందుకు చేపట్టిన బడిబాట కార్యక్రమం ద్వారా ఈ విద్యా సంవత్సరంలో 2,632 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా చేరారు. వర్షాకాలం ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా మొత్తం 1,62,414 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. ప్రజల భూ సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం అమలులో భాగంగా గ్రామ రెవెన్యూ సదస్సులు విజయవంతంగా నిర్వహించబడ్డాయి. ఈ సదస్సుల సందర్భంగా మొత్తం 6,107 దరఖాస్తులు స్వీకరించబడ్డాయి. వన మహోత్సం సందర్భంగా దాదాపు 65 లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. అలాగే మహిళా సంఘాలకు రూ. 133 కోట్ల రుణాల చెక్కును అందజేశారు. డ్రగ్స్, వైద్య, ఆరోగ్య శాఖ పోస్టర్లను ఆవిష్కరించారు. అలాగే దివ్యాంగులకు ట్రై సైకిళ్లు మంత్రులు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు కలిసి పంపిణీ చేశారు. ఈ సమావేశంలో నిర్మల్, ముథోల్, ఖానాపూర్‌ల శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పవార్ రామారావు పటేల్, వెడ్మ బొజ్జు, గ్రంథాలయ చైర్మన్ సయ్యద్ అర్జుమన్ అలీ, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్‌కుమార్, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పలు పథకాల లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజల మీద సానుభూతితోనే..

ప్రత్యేకరాష్ట్రం ఇచ్చే విషయంలో తెలంగాణ ప్రజల మీద ఉన్న సానుభూతితోనే ఆంధ్రాలో ఓడిపోతామని తెలిసి కూడా సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రం ఇచ్చారని ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆ క్రెడిట్ ముమ్మాటికి కాంగ్రెస్ పార్టీదేనని వ్యాఖ్యానించారు. శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ, డా. బీఆర్. అంబేద్కర్, కుమ్రం భీమ్, శివాజీ లాంటి మహనీయుల జీవన విధానాన్ని అవలంబించడం, వారి ఆశయాలను కొనసాగించడమే వారికి నిజమైన నివాళి అని అన్నారు. నాలుగు కోట్ల ప్రజల ఆంక్షలను నెరవేర్చిన ఘనత సోనియాగాంధీకే దక్కుతుందని చెప్పారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమన్ అలీ, నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్‌రెడ్డి, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి, నిర్మల్ మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఎంబడి రాజేశ్వర్, నిర్మల్ పట్టణ అధ్యక్షుడు నాందేడపు చిన్ను, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బైక్ ర్యాలీ

రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు నిర్మల్ వచ్చిన సందర్భంగా డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు ఆధ్వర్యంలో ఘనంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శివాజీచౌక్‌లో గల శివాజీ విగ్రహానికి మంత్రి జూపల్లి కృష్ణారావు పూలమాల వేసి అక్కడి నుంచి ర్యాలీగా మినీ ట్యాంక్‌బండ్‌కు తరలివెళ్లారు. మార్గమధ్యంలో మహాత్మాగాంధీ, కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాలకు మంత్రి పూలమాలలు వేశారు. నిర్మల్ నియోజకవర్గ నలుమూలల నుండి తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీలో పాల్గొని బైక్ ర్యాలీని విజయవంతం చేశాయి. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి, గ్రంథాలయ చైర్మన్ అర్జుమన్‌అలీ, నిర్మల్ మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎంబడి రాజేశ్వర్ సహా పలువురు ప్రముఖ నాయకులు ఈ ర్యాలీలో పాల్గొని పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహాన్ని నింపారు.



బైక్ ర్యాలీలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు

ఉన్న వారికే ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చారు

అర్హులైన వారికే ఇవ్వాలని ఖానాపూర్‌లో పాత ఎల్లాపూర్ గ్రామస్థుల ఆందోళన



తహసీల్దార్ సుజాత రెడ్డికి వినతి పత్రాన్ని అందజేస్తున్న పాత ఎల్లాపూర్ గ్రామస్థులు

ఖానాపూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఇళ్లున్న వారికే ఇందిరమ్మ ఇళ్లను ఇచ్చారని అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్లను ఇవ్వాలని మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని వడ్డెర కాలనీ వాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఖానాపూర్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఆందోళన చేస్తున్న పాత ఎల్లాపూర్ వడ్డెర కాలనీ వాసులకు ఎం సీపీఐ (యు) జిల్లా కార్యదర్శి అల్లెపు పీటర్, సహాయ కార్యదర్శి భూక్యా సురేందర్‌లు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా పీటర్, సురేందర్ మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగలేదన్నారు. నిజమైన నిరుపేదలను కాదని అంతర్గత ఒప్పందాలతో ఇందిరమ్మ ఇళ్లను పక్కదారి పట్టించారన్నారు. వెంటనే ఎంపిక చేసిన లబ్ధిదారులపై అధికారులచే విచారణ నిర్వహించి నిజమైన అర్హులకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పల్లపు చంద్రకళ, చిన్నయ్య, దారంగుల లక్ష్మీ, పల్లపు ఎల్లయ్య, మక్కల లక్ష్మీ తదితరులున్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి అంకితభావంతో కృషి

ముథోల్ ఎమ్మెల్యే రామరావ్ పాటిల్



భైంసాలో చెక్కులు పంపిణీ చేస్తున్న ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్

భైంసా, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బాధ్యతాయుతమైన విధానాల ద్వారా నియోజకవర్గ పరిధిలోని అన్ని వర్గాల సంక్షేమానికి అంకితభావంతో కృషి చేస్తున్నానని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ పేర్కొన్నారు. శుక్రవారం భైంసాలోని బృందావన్ గార్డెన్స్‌లో కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రణాళికబద్ధమైన విధానాల ద్వారా నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకు త్వరతగతిన షాదీముబారక్, కళ్యాణలక్ష్మీ చెక్కులను అందింపజేసేందుకు గాను చర్యలు చేపడుతున్నామన్నారు. ఇదే క్రమంలో అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిచేకూరేలా పాటు పడుతున్నామని వివరించారు. నియోజకవర్గ పరిధిలో సమస్యల పరిష్కారానికి అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టేందుకు గాను చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకం కింద రూ. లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని హామీనిచ్చి విస్మరించడం భావ్యం కాదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని హామీల అమలులో రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ సర్కార్ పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 11వ సంవత్సరాల పాలనలో చేపట్టిన సంస్కరణలు, తీసుకుంటున్న చారిత్రాత్మక నిర్ణయాలు, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల మూలంగా ప్రపంచంలోనే అగ్రగామిగా దూసుకుపోతుందన్నారు. ఇందులో భైంసా మార్కెట్ కమిటి చైర్మన్ ఆనంద్‌రావ్ పాటిల్, ఆత్మచైర్మన్ సిద్ధంవార్ వివేకానంద, పీఏసీఎస్ చైర్మన్ దేవేందర్ రెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, బీజేపీ పట్టణ, మండల అధ్యక్షులు రావుల రాము, సిరం సుష్మారెడ్డి, బీజేపీ ప్రతినిధులు సోలంకీ భీంరావ్, బోస్లే పండిత్ రావ్ పాటిల్, యనుపోతుల మల్లేశ్వర్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ గౌతం పింగ్లే, బీజేవైఎం డివిజన్ ప్రతినిధి గంగాప్రసాద్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

బాసర నదీ తీరంలో రక్షణ చర్యలు



నదితీరంలో రక్షణ చర్యల గురించి చర్చిస్తున్న ఆర్డీవో

బాసర,జూన్27(ఆంధ్రజ్యోతి) : బాసర గోదావరి తీరంలో రక్షణ చర్యలు చేపట్టేందుకు యంత్రాంగం సిద్ధమవుతోంది. కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాలతో భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి బాసరలో భద్రత ఏర్పాట్లపై దృష్టి పెట్టారు. ఇప్పటికే వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీవో కోమల్‌రెడ్డి శుక్రవారం మరోసారి బాసర వచ్చారు నదితీరంలో పర్యటించారు. పోలీసులు, ఆర్అండ్‌బీ, రెవెన్యూ, దేవాదాయశాఖ అధికారులతో క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యల గురించి చర్చించారు. ఇటీవలే ఐదుగురు యువకులు అమ్మవారి దర్శనానికి వచ్చి గోదావరిలో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందిన విషయం తెలిసిందే. దీన్ని సీరియస్‌గా తీసుకున్న జిల్లా అధికారులు మరోసారి ఘటన జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇనుప ఫైపులు, చైన్‌లతో భక్తులు నది లోపలికి వెళ్లకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. నది నీటి ప్రమాదకర పాయింట్ వద్ద భక్తులకు తెలిసే విధంగా బోర్డులను, జెండాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. ఒక టవర్ పాయింట్ ఏర్పాటు చేసి అక్కడ నిరంతరం ఒక మనిషితో నిఘా ఉంచాలని చెప్పారు. ఒకవేళ భక్తులు నది లోపలికి వెళ్లి స్నానాలు చేసే ప్రయత్నం చేస్తే టవర్‌పై నుంచి నది స్నానఘట్టాల వద్ద ఉన్న గజ ఈతగాళ్లను అప్రమత్తం చేసి వారికి నీటి లోపలికి వెళ్లకుండా అడ్డుకోవాలన్నారు. ఇదంతా అనౌన్స్‌మెంట్ సిస్టంతో సూచించారు. నది స్నానఘట్టాల వద్ద చెత్తా, చెదారం లేకుండా చూడాలని ఆలయ అధికారులకు సూచించారు. ప్రమాదం జరిగాక చర్యలు తీసుకోవడం కాదు. ముందే జాగ్రత్తలు తీసుకోవాలో చూడాలని అన్నారు. భక్తుల భద్రత విషయంలో డబ్బుల గురించి రాజీ పడవద్దని ఖర్చు ఎంతైనా భక్తుల ప్రాణాలు ముఖ్యమని అన్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శించుకొని క్షేమంగా వెళ్లే విధంగా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆర్డీవో వెంట ఆర్అండ్‌బీ అధికారులు, బాసర మండల తహసీల్దార్ పవనచంద్ర, బాసర ఎస్సై శ్రీనివాస్, అమ్మవారి దేవస్థానం ఏఈవో సుదర్శన్ గౌడ్, సూపరింటెండెంట్ శివరాజ్ తదితరులున్నారు.

సబ్‌సెంటర్ షెడ్డు నిర్మాణానికి భూమిపూజ



షెడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న నాయకులు

కుంటాల, జూన్, 27 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామంలో పీఏసీఎస్ సబ్‌సెంటర్ షెడ్డు నిర్మాణం కోసం వైస్ చైర్మన్ గుద్దేటి లావణ్య కిష్టయ్య, రైతులు, వీడీసీ నాయకులు శుక్రవారం భూమి పూజ చేశారు. వైస్ చైర్మన్ విజ్ఞప్తి మేరకు ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి చొరవతో 2 లక్షల 99 వేల రూపాయల నిధులను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి నిధులు మంజూరు చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ తూర్పాటి వెంకటేష్, కుంటాల పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం, మాజీ సర్పంచ్ చంద్రకాంత్, నాయకులు దిగంబర్ పటేల్, పీఏసీఎస్ డైరెక్టర్ పసులలక్ష్మీ, వీడీసీ సభ్యులు, నాయకులు పురుషోత్తం, లక్ష్మణ్‌రావు, ఎల్లన్నతో పాటు పలువురు ఉన్నారు.

ఆదివాసీలు అధైర్యపడొద్దు

● జీవో 49కి ఇంకా గెజిట్ విడుదల చేయలేదు : మంత్రి జూపల్లి కృష్ణారావు
● జీవోను వెంటనే రద్దు చేయాలని పలువురు ఎమ్మెల్యేల డిమాండ్


హాజరైన ఆదివాసీ గిరిజనులు

ఉట్నూర్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఆదివాసీ గిరిజనులు ఎవరూ ఆందోళన చెందొద్దని, అధైర్య పడవద్దని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 49కి ఇంకా గెజిట్ విడుదల చేయలేదన్నారు. శుక్రవారం ఉట్నూర్‌లోని కొమురంభీం ప్రాంగణంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీ గిరిజనుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజనులు పేర్కొన్న పలు అంశాలపై ఆయన సమాధానం ఇచ్చారు. అనంతరం జూపల్లి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవోను తాను సమావేశానికి వచ్చేటప్పుడు మధ్యలో చదివానన్నారు. ఈ విషయమై వెంటనే ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు (పీసీసీఎఫ్) సువర్ణతో మాట్లాడానని, జీవోపై ఇంకా స్పష్టత రానందు వల్ల ఆదివాసీలు ఎవరూ భయాందోళనకు గురి కావద్దన్నారు. ఈ సందర్భంగా పలువురు ఆదివాసీ గిరిజన నాయకులు, ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యేలు కోవలక్ష్మి, పాల్వాయి హరీష్‌బాబులు మంత్రి ప్రసంగంలో జోక్యం చేసుకొని దొడ్డిదారిలో జీవో తెచ్చారని ఆరోపించారు. స్పందించిన మంత్రి కృష్ణారావు వెంటనే సెల్‌ఫోన్ ద్వారా పీసీసీఎఫ్‌తో మాట్లాడి.. ఇంకా గజిట్ విడుదల చేయలేదని సమావేశంలోనే చెప్పించారు. అటవీ హక్కుల చట్టం ద్వారా గిరిజనులకు ఇచ్చిన భూములను వాపసు తీసుకోవడం జరగదన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా మాత్రమే అడవుల రక్షణ ఉంటుందన్నారు. గిరిజనుల సంక్షేమం కోసం, అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. 2021లో అప్పటి ప్రభుత్వంలో ఉన్న పీసీపీఎఫ్ శోభ కేంద్రానికి లేఖ రాశారని తెలిపారు. కానీ తమ ప్రభుత్వం ఆదివాసీల పక్షాన ఉంటుందని, ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. ఈ విషయమై ఆదివాసీ పెద్దలు, ప్రజాప్రతినిధులతో కలిసి హైదరాబాద్‌లోని తన చాంబర్‌లో సమావేశం ఏర్పాటు చేస్తామని మంత్రి జూపల్లి ప్రకటించారు. రెండు చేతులు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

జోడించి కోరుతున్నా.. ఆదివాసీలకు ఎట్టి పరిస్థితుల్లో హాని జరగనివ్వబోనని స్పష్టం చేశారు. రూ.12వేల కోట్ల వ్యయంతో అటవీ హక్కుల భూముల్లో గిరి సౌర జల వికాసం కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. అయితే జీవోను వెంటనే రద్దు చేయాలని ఎమ్మెల్యేలు కోవలక్ష్మి, హరీష్‌బాబు, ఎంపీ నగేష్‌లతో పాటు ఆదివాసీ సంఘాల నాయకులు, తుడందెబ్బ నాయకులు సమావేశంలో మంత్రి డిమాండ్ చేశారు. ఇందుకు స్పందించిన మంత్రి జూపల్లి గజిట్ విడుదల చేయకపోతే జీవో పని చేయదని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ మాట్లాడుతూ.. ఇది రాజకీయ వేదిక కాదన్నారు. మంత్రి స్పష్టమైన హామీ ఇస్తున్నందు వల్ల ప్రజాప్రతినిధులు, ఆదివాసీ సంఘాల నాయకులు గౌరవించాలని కోరారు. కవ్వాల్‌టైగర్‌జోన్ ఏర్పాటు వల్ల ఈ ప్రాంతంలోని ప్రజలు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సమావేశంలో ఎంపీ నగేష్, పలువురు, ఎమ్మెల్సీ దండేవిఠల్, జీసీసీ చైర్మన్ తిరుపతి, మాజీ ఎమ్మెల్యే సక్కు, మాజీ ఎంపీ బాపురావు, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, అదనపు కలెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రం సుగుణ, ఏఎంసీ చైర్మన్లు, ఆదివాసీ ప్రతినిధులు సిడం అర్జు, సీడం భీమ్రావు, గోడంగణేష్, పెందూరుదాదిరావు, పుర్క బాపురావు, పెందూరు ప్రభాకర్, పెందూరుగోపి, తదితరులున్నారు.

● ఆసుపత్రిలో అన్ని సమస్యలు పరిష్కరిస్తాం

ఉట్నూర్: ఉమ్మడి జిల్లాలోని గిరిజనే ప్రాంతాల ప్రజలకు ప్రధాన కేంద్రమైన ఉట్నూర్ మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు డాక్టర్లు ఇతర సిబ్బందిని కూడా నియమిస్తామని జిల్లా ఇన్‌చార్జీ మంత్రి జూపల్లికృష్ణారావు ప్రకటించారు. శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని జిల్లా ఆసుపత్రిలో రూ.13.70కోట్లతో మంజూరైన అదనపు గదుల భవన నిర్మాణం కోసం ఎంపీ నగేష్, ఎమ్మెల్యే బొజ్జుపటేల్, ఎమ్మెల్సీ దండేవిఠల్‌లతో కలిసి శంఖుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఆ తర్వాత ఉట్నూర్‌లోని కొమురంభీం ప్రాంగణంలో నిర్వహించిన ఆదివాసీల ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన జిల్లా ఇన్‌చార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా స్వాగతం పలికి పూల బొకే అందించారు. అనంతరం మంత్రి ప్రాంగణంలో ఉన్న గిరిజన వీరుడు అమరుడు కొమురంభీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

అలాగే, ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అధ్యక్షుడు ఖయ్యూమ్ కుటుంబాన్ని మంత్రి పరామర్శించారు. కాగా, తొలిసారిగా జిల్లా ఇన్‌చార్జీ మంత్రి బాధ్యతలు చేపట్టిన జూపల్లి శుక్రవారం ఉట్నూర్‌కు రావడంతో ప్రజలు పెద్దసంఖ్యలో వినతులు సమర్పించారు.

● ఆదివాసీ గిరిజన అమరవీరులకు మంత్రి నివాళి

ఇంద్రవెల్లి: ఆదివాసీ గిరిజన అమరవీరులకు శుక్రవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఘన నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా అధికారులతో ఇంద్రవెల్లిలోని ఆదివాసీ గిరిజన అమరవీరుల స్తూపం వద్ద స్మృతి వనంలో మొక్కను నాటి నీరు పోశారు. ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు, ఎమ్మెల్సీ దండే విఠల్, అధికారులు పాల్గొన్నారు.


ఇంద్రవెల్లిలో అమరవీరులకు నివాళులర్పిస్తున్న మంత్రి జూపల్లి

వద్దన్నా.. వాడుతున్నారు!

(5వ పేజీ తరువాయి...)

గడ్డి మందుల వాడకంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. రౌండప్ మందులను తట్టుకునే బీటీ-3 రకం పత్తి సాగు వైపే ఎక్కువ మంది రైతులు మొగ్గుచూపుతున్నారు.

వ్యాపారుల దోపిడీ దందా

నిషేధం పేరిట వ్యాపారులు అడ్డగోలుగా దోపిడీ దందాకు పాల్పడుతున్నారు. ఇష్టారాజ్యంగా ధరలు నిర్ణయిస్తూ అమ్మేసుకుంటున్నారు. మహారాష్ట్రలో లీటర్ రౌండప్ మందు రూ.600 నుంచి రూ.700ల వరకు కొనుగోలు చేసి జిల్లాలో రూ.1200ల వరకు విక్రయిస్తున్నారు. ఇదేమిటని అడిగితే.. తమ వద్ద రౌండప్ మందులు లేవని తిప్పిపంపుతున్నారు. పరిచయం, నమ్మకమైన రైతులకు మాత్రమే వ్యాపారులు రౌండప్ మందులను విక్రయిస్తున్నట్లు తెలుస్తుంది. గుర్తుతెలియని రైతులకు మాత్రం నిషేధం ఉందని చెబుతూ తిప్పి పంపుతున్నారు. సరిహద్దు మండలాల్లో కొంత మంది రైతులు నేరుగా గడ్డి మందులను కొనుగోలు చేస్తూ వాడుతున్నా రు. ప్రస్తుతం కొంతమంది డీలర్లు భారీగా రౌండప్ మందులను డంపు చేసుకున్నట్లు తెలుస్తుంది. మారుమూల గ్రామాల్లో నిల్వ చేస్తూ అదును చూసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. పత్తి పంటలో దౌర కొట్టడం, కూలీలతో కలుపు నివారణకు చర్యలు చేపట్టాల్సి ఉండగా రౌండప్ మందులను స్ప్రే చేస్తూ కలుపు నివారణ చేపడుతున్నారు. ప్రమాదకర గ్లైపోసైట్ మందుల వాడకంపై రైతుల్లో అవగాహన కల్పించాల్సి ఉండగా అధికారులు.. ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని తెలుస్తుంది. దీంతో ప్రతీయేటా జిల్లాకు రౌండప్ మందులను సరఫరా చేస్తూ పలువురు వ్యాపారులు పట్టుబడుతున్నారు.

108 వాహనంలో మహిళ ప్రసవం

బజార్‌హత్నూర్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోకొండ గ్రామానికి చెందిన బర్ధాల్ సోని అనే మహిళ 108 వాహనంలో శుక్రవారం పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. కుటుంబీకుల వివరాల ప్రకారం.. గోకొండ గ్రామానికి చెందిన బర్ధాల్ జిత్తు భార్య సోనికి పురిటి నొప్పులు రావడంతో కుటుంబీకులు వెంటనే 108కు సమాచారం అందించారు. అంబులెన్స్ సిబ్బంది హుటాహుటిన చేరుకుని గర్భిణీని వాహనంలో ఆదిలాబాద్‌కు తీసుకొని వెళ్తున్న క్రమంలో మార్గమధ్యలోనే గుడిహత్నూర్ మండలకేంద్రం సమీపంలో మధ్యాహ్నం 12 గంటల సమయమంలో మగబిడ్డకు జన్మనిచ్చినట్లు ఈఎంటీ సురేష్, పైలెట్ రాజారాంలు తెలిపారు. ప్రస్తుతం తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉన్నారని, వారికి మెరుగైన చికిత్స కోసం ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు.

మహిళ కడుపులో నుంచి కణతి తొలగింపు

బోథ్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): బోథ్ పట్టణ కేంద్రానికి చెందిన ఓ మహిళ గత కొన్ని సంవత్సరాలుగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతోంది. దీంతో సదరు మహిళ తమ ఆసుపత్రికి వచ్చి పరీక్షలు చేసుకోగా.. కడుపులో పెద్ద కణతి ఉన్నట్లు గుర్తించామని వైద్యులు పేర్కొన్నారు. అయితే శుక్రవారం స్థానిక ప్రసాద్ ఆసుపత్రిలో ఆపరేషన్ చేయడంతో ఆరు కిలోల కణతిని తొలగించామన్నారు. ఆపరేషన్‌లో డాక్టర్ రవీంద్ర ప్రసాద్‌తో పాటు జక్కుల శ్రీకాంత్, డాక్టర్ వెంకటేశ్వర్ల బృందం ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

తరోడ బ్రిడ్జి వద్ద రోడ్డు ప్రమాదం

జైనథ్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని తరోడ బ్రిడ్జి వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బస్సుకు లారీ ఢీ కొట్టింది. జైనథ్ ఎస్సై గౌతంపవార్ నాయక్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. మహారాష్ట్ర నుంచి సిమెంట్ లోడుతో ఓ లారీ (ఏపీ20టీబీ6639) ఆదిలాబాద్‌కు వెళ్లే క్రమంలో బ్రిడ్జి వద్ద భారీ లోడు వల్ల బరువుతో వెనక్కి వచ్చింది. అయితే, ఇదే క్రమంలో మహారాష్ట్రకు చెందిన ఆర్టీసీ బస్సు (ఎంహెచ్ఏయూ406322) ఆదిలాబాద్ వైపునకు వస్తుంది. కాగా, వెనుక వస్తున్న బస్సును లారీ ఢీ కొట్టడంతో బస్సు ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. దీంతో సిమెంట్ లోడుతో ఉన్న లారీ అదుపు తప్పి బోల్తాపడగా.. సిమెంట్ బస్తాలు కింద పడ్డాయి. కాగా, బస్సులో ఉన్న ప్రయాణికులు సురక్షితం ఉన్నట్లు తెలిపారు. బస్సును వెనుక నుంచి ఢీ కొట్టిన లారీ డ్రైవర్ పవార్ సచిన్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫ్లాష్.. ఫ్లాష్..

అప్పుల బాధతో

యువ రైతు ఆత్మహత్య

● తాంసి మండలం జామిడి గ్రామంలో ఘటన

తాంసి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని జామిడి గ్రామానికి చెందిన మునేశ్వర్ కిరణ్ (35) అనే యువ రైతు అప్పుల బాధతో శుక్రవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కిరణ్ తనకున్న నాలుగు ఎకరాల్లో వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. అయితే ప్రతీ యేడు దిగుబడులు సరిగ్గా రాకపోవడంతో.. ప్రైవేటు వ్యక్తులతో పాటు పలు బ్యాంకుల్లో రూ. 5లక్షల వరకు అప్పు చేశాడు. ఓవైపు పంట దిగుబడి సరిగ్గా రాకపోవడం.. మరోవైపు ఆర్థికంగా ఇబ్బందులు కావడం.. ఇంకోవైపు అప్పులు తీర్చాలని ఇచ్చిన వారు వేధిస్తుండడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. మరో గత్యంతరం లేని పరిస్థితుల్లో శుక్రవారం రాత్రి తన పొలంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. తోటి రైతులు గమనించి వెంటనే చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో కిరణ్ మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తాంసిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

తాంసి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి శుక్రవారం పాలాభిషేకం నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో సీఎం చిత్రపటాన్ని ఏర్పాటు చేసి మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు కార్యకర్తలు తరలివచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం రైతు పెట్టుబడి సాయాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేశారన్నారు. ప్రతి రైతు రుణమాఫీని చేయడమే కాకుండా అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నారని అన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో పూర్తిస్థాయి విజయనందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కౌడాల నారాయణ, నాయకులు శ్రీధర్ రెడ్డి, వడ్డాది గంగాధర్, మంత్రి గంగారెడ్డి, సంతోష్, కప్పర్ల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌కు తరలిన యువకులు

బోథ్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన ర్యాలీకి స్థానిక ఎస్సై ప్రవీణ్ ఆధ్వర్యంలో యువకులు తరలి వెళ్లారు. జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లో నిర్వహించనున్న ఈ ర్యాలీకి బోథ్ నుంచి తరలి వెళ్లారు. గ్రామంలో ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించిన అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులో ర్యాలీకి వెళ్లడం జరిగింది.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

బోథ్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): గత రెండు సంవత్సరాల క్రితం కోట్లాది రూపాయల అక్రమాలు బోథ్‌లోని ఉపాధి హామీ కార్యక్రమంలో జరిగాయని, అక్రమార్కులపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వ అధికారులు విఫలమయ్యారని బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు ప్రవీణ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధి హామీ కార్యక్రమంలో భారీగా అక్రమాలు జరిగాయని, అయితే అక్రమాలకు పాల్పడ్డ వారి నుంచి డబ్బులు రికవరీ చేయడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. నామమాత్రంగా రికవరీలు పెట్టి తిరిగి పోస్టింగులలో ఉంచడం జరిగిందన్నారు. జిల్లా అధికారులు ఉపాధ్యాయుని పథకంలో దోపిడీకి పాల్పడ్డ వారిపై పూర్తిస్థాయిలో రికవరీ అయిన తర్వాతనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

'స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం'

బోథ్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసి కట్టుగా పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేద్దామని, అందుకు ప్రతీ ఒక్కరు సహకరించాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర విచారి విభాగం కోఆర్డినేటర్ తుల అరుణ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు గాజుల పోతన్న, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ రమేష్ బత్తుల, సోనాల పట్టణ అధ్యక్షుడు అనిల్, పీఏసీఎస్ డైరెక్టర్ పోశెట్టి, లోలకు ఏఎంసీ డైరెక్టర్ ఇసురు పటేల్, కసిర పోతన్న, తదితరులు పాల్గొన్నారు.


బాసర తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

పెండింగ్ రుణమాఫీ చేయాలి

● బాసరలో బీజేపీ నాయకుల ఆందోళన

బాసర, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న రైతులందరికీ వ్యవసాయ రుణాలను మాఫీ చేయాలని మండల బీజేపీ అధ్యక్షులు సాయినాథ్ పటేల్ డిమాండ్ చేశారు. శుక్రవారం బాసర మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ.. నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. అనేక హామీలు ఇచ్చి గద్దెక్కిక్కిన కాంగ్రెస్ పార్టీ ఆ తర్వాత వాటటి అమలును మర్చిపోయిందని అన్నారు. రూ. రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తానని చెప్పి తూతూ మంత్రంగా కొంత మందికే చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. మిగిలిపోయిన ప్రతి రైతుకు రుణమాఫీ జరపాలని అదే విధంగా కొత్త పింఛన్‌లను అందించాలని ఎన్నికల్లో హామీ మేరకు పింఛన్‌లను పెంచాలని అన్నారు. అదే విధంగా ప్రతి మహిళకు ఇస్తానన్న నగదు హామీని నెరవేర్చాలని కోరారు. కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ పథకాల కింద ప్రతి ఆడబిడ్డ పెళ్లికి ఇస్తానన్న తులం బంగారం పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే మోసపూరిత హామీల గురించి ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని చైతన్య పరుస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ పవనచంద్రకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు సతీశ్‌రావు, మండల నాయకులు సాయినాథ్, బి. రమేశ్, తదిరులున్నారు.

నిర్మల్ నుంచి రామేశ్వరం బయలుదేరిన ఆర్టీసీ బస్సు

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ నుండి రామేశ్వరానికి శుక్రవారం ఆర్టీసీ బస్సు బయలుదేరినట్లు డీఎం పండరి తెలిపారు. కాణిపాకం, అరుణాచలం, పలని, పాతాళసెంబు, రామేశ్వరం, ధనుష్కోడి వెళ్లి తిరిగి నిర్మల్‌కు జూలై 2వ తేదీన వస్తుందని పేర్కొన్నారు. తీర్థయాత్రలకు బస్సులు నడుపుతున్నట్లు తెలుపగానే ప్రయాణికులు 2 రోజుల్లోనే టికెట్లు బుక్ చేసుకున్నారని డిపో మేనేజర్ కే. పండరి తెలిపారు. మళ్లీ అరుణాచలం, రామేశ్వరం బస్సు జూలై నెలలో ఉంటుందని ఆయన తెలిపారు. జూలై చివరి వారంలో ప్రయాగ్‌రాజ్, వారణాసి, అయోధ్య, భద్రాచలం, అన్నవరం, సమ్మక్క, సారలక్కలకు కూడా బస్సు పెడుతున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు. నిర్మల్ నుండి ఏ పుణ్యక్షేత్రాలకైనా బస్సులు ఇస్తామని ఆర్టీసీని ఆదరించి ఆర్టీసీ బస్సులోనే ప్రయాణించాలని ఆయన కోరారు. మీరు ఎక్కడి కెళ్లాలన్న 9959226003, 8328021517కు ఫోన్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.


తీర్థయాత్రలకు బయలుదేరుతున్న బస్సు

కొనసాగుతున్న ధ్రువీకరణ పత్రాల పరిశీలన


హాజరైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు


ప్రక్రియను పరిశీలిస్తున్న వైస్ చాన్సలర్ గోవర్ధన్

బాసర, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటి), బాసర, మహబూబ్‌నగర్ కేంద్రానికి చెందిన స్పోర్ట్స్ కోటా కింద దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల ధ్రువపత్రాలను శుక్రవారం అధికారులు పరిశీలన ప్రక్రియ చేపట్టారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఏ. గోవర్ధన్, ఓఎస్‌డీ ప్రొఫెసర్ ఈ మురళీదర్శన్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ.. యూనివర్సిటీ చాలా సమర్థవంతంగా, సజావుగా ముందుకు సాగుతోంది. మేము విద్యా నాణ్యతకు, విద్యార్థుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నాం. ప్రతి సమస్యను పట్టుదలగా పరిష్కరిస్తూ. సమర్థవంతంగా యూనవర్సిటీ నడవడం మాముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఎస్‌సీసీ కోటాలో విద్యార్థులు సమర్పించిన క్యాంప్ సర్టిఫికెట్‌లు, రిపబ్లిక్ డే పరేడ్ (ఆర్‌డీసీ) సర్టిఫికెట్‌లు, బీఅండ్‌సీ సర్టిఫికెట్‌లు పూర్తిగా పరిశీలించారు. స్పోర్ట్స్ కోటా కోసం 31 క్రీడల జాబితాలో లభించే ఆటల ఆధారంగా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయస్థాయిలో పొందిన ప్రమాణపత్రాలను క్రీడా నిపుణులు క్షుణ్ణంగా పరిశీలించి ధ్రువీకరించారు. క్రీడాసంఘాల గుర్తింపు, పోటీల స్థాయి, తేదీ, అర్హత ప్రమాణాలను బట్టి జాగ్రత్తగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమం ధ్రువపత్రాల పరిశీలన కన్వీనర్ డా.చంద్రశేఖర్ సమన్వయంతో కో కన్వీనర్‌లు డా.దేవరాజు, డా. విఠల్, డా. భవ్‌సింగ్, డా. రాకేశ్‌రెడ్డి నిర్వహించారు. స్పోర్ట్స్, ఎన్‌సీసీ అధికారుల సమక్షంలో ధ్రువీకరణ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగిందని యూనివర్సిటీ అధికారులు తెలిపారు. ఎన్‌సీసీ ఇన్‌చార్జీ దస్తగిరి, స్పోర్ట్స్ ఇన్‌చార్జీ పీడీ శ్యాంబాబు, సహాయకులు కిషన్, ఉదయ్, అశోక్ తదిరతులున్నారు.

పీహెచ్‌సీ, క్యాప్ కోటా విద్యార్థులకు సర్టిఫికెట్‌లు సైతం

రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్(ఆర్జీయూకేటి) బాసరలో ఫిజికల్ హ్యాండిక్యాప్(పీహెచ్‌సీ), సాయుధ బలగాల కోటా (క్యాప్) కేటగిరిలో దరఖాస్తు చేసిన విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలను సైతం అధికారులు పరిశీలించారు. ఈ ప్రక్రియ గురువారం ప్రారంభించిన అధికారులు శుక్రవారం పూర్తి చేశారు.

పీహెచ్‌సీ కోటాలో హెరింగ్ ఇంపెయిర్డ్, మెంటల్ రిటార్డేషన్, మల్టిపుల్ డిసార్డర్ ఆర్తోపెడిక్ డిసెబిలిటీస్, విజువల్ ఇంపెయిర్డ్ వంటి విభిన్న దివ్యాంగ విద్యార్థులు ఈ ప్రక్రియకు హాజరయ్యారు. ధ్రువీకరణ పత్రాలను నిర్మల్ జిల్లా ప్రభుత్వ వైద్యుల బృందం పరిశీలించింది.

సాయుధ బలగాల సిబ్బందికి చెందిన పిల్లల(క్యాప్) పత్రాల పరిశీలనను సంబంధిత సాయుధ శాఖల అధికారులు పర్యవేక్షణలో నిర్వహించారు.

ధ్రువీకరణ ప్రక్రియ పూర్తయిన విద్యార్థుల ప్రొవిజనల్ సెలెక్టెడ్ లిస్టును విశ్వవిద్యాలయ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరచనున్నారు. జూలై 4న విడుదల ప్రొవిజనల్లీ సెలెక్టెడ్ లిస్ట్ రిలీజ్ చేయనున్నారు. మొదటి విడత కౌన్సిలింగ్ జూలై 7వ తేదీన ప్రారంభమవుతుందని అధికారులు తెలిపారు.

మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకునేంత వరకు విశ్రమించేది లేదు

● బీజేపీ భైంసా పట్టణ అధ్యక్షులు రావుల రాము


మాట్లాడుతున్న బీజేపీ భైంసా పట్టణ అధ్యక్షులు రావులు రాము

భైంసా, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికబద్ధమైన చర్యలు, పకడ్బందీ విధానాలతో మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకునేంత వరకు విశ్రమించకుండా ముందుకు సాగుతామని బీజేపీ భైంసా పట్టణ అధ్యక్షులు రావుల రాము, జిల్లా కార్యవర్గ సభ్యుడు యనుపోతుల మల్లేశ్వర్‌లు వెల్లడించారు. శుక్రవారం స్థానిక బృందావన్ గార్డెన్స్‌లో జరిగిన పార్టీ సమావేశంలో మాట్లాడారు. పార్టీ శ్రేణులన్నీ కార్యోన్ముకులై ఎన్నికల సంగ్రామానికి సన్నద్ధమవ్వాలన్నారు. మున్సిపల్ పాలన వైఫల్యాలను, తప్పిదాలను క్షేత్ర స్థాయిలో వార్డు వార్డునా సమావేశాలు నిర్వహించి విస్తృతంగా ప్రచారం చేస్తామన్నారు. అధికార యంత్రాంగానికి అవలంభించిన లోపాయిభూయిష్ట విధానాలపై పోరుబాట చేపడుతామన్నారు. ఇందులో భాగంగానే తైబజార్ వేలం పాటలోని లోపాయికారి విధానాలను ఎండగట్టి బహిరంగ వేలం పాటలు నిర్వహించి మున్సిపాల్టీకి గణనీయమైన అధనపు ఆదాయం లభించేలా పార్టీ శ్రేణులు పాటు పడ్డాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాల అమలులో మీనమేషాలు లెక్కిస్తుందన్నారు. ఆర్భాటపు ప్రచారానికే పరిమితమవుతూ క్షేత్ర స్థాయిలో పథకాల అమలులో వైఫల్యాం చెందుతుందని ఆరోపించారు. పార్టీ శ్రేణులు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు, సాధించిన విజయాలు, చేపట్టిన సంస్కరణల గురించి విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. పార్టీ అభ్యర్థులెవరైన గెలుపే లక్ష్యంగా పట్టణ బీజేపీ శ్రేణులు ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఇందుల మాజీ కౌన్సిలర్ గౌతం పింగ్లే, బీజేపీ ప్రతినిధులు రావుల పోశెట్టి, గాలి రాజన్న, బండారి దిలీప్, కాసరోల్ల ప్రవీణ్, మాణిక్ దగ్దేతో పాటు పలువురు ఉన్నారు.

కామ్రేడ్ డీవీకే ఆశయాలు కొనసాగిద్దాం

నిర్మల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : విప్లవోద్యమ నాయకుడు, ఆదర్శ కమ్యూనిస్టు ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి కామ్రే డీవీ కృష్ణ 3వ వర్ధంతి సభ సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) నిర్మల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లా కేంద్రంలో శుక్రవారం వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కే. రాజన్న, కామ్రేడ్ డీవీకే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ... కామ్రేడ్ డీవీ కృష్ణ ఆదర్శ కమ్యూనిస్టు అని, విప్లవోద్యమానికి ఆయన చేసిన కృషిని కొనియాడారు.

బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిక

నిర్మల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : మామడ మండలంలోని దిమ్మదుర్తి గ్రామానికి చెందిన పొన్నం సురేందర్ గౌడ్ ఆధ్వర్యంలో 100 మంది బీజేపీ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో శుక్రవారం చేరారు. వీరికి డీసీసీ అధ్యక్షుడు శ్రీహరి రావు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి నేడు రాష్ట్రంలో ఆయా పార్టీల నుంచి ఎందరో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే మా పార్టీ హితమని అన్నారు.


పార్టీలోకి ఆహ్వానిస్తున్న నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో దళారులను నమ్మవద్దు

ఖానాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్లు చిన్నం సత్యం, అంకం రాజేందర్


పట్టణంలోని 9వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న అధికారులు, నాయకులు

ఖానాపూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో అర్హులైన నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు దక్కుతాయని, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ఎటువంటి దళారులను నమ్మవద్దని మున్సిపల్ మాజీ చైర్మన్లు చిన్నం సత్యం, అంకం రాజేందర్‌లు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఐదవ వార్డు, తొమ్మిదవ వార్డులలో నిర్వహించిన వేర్వేరు కార్యక్రమాలలో ఇరువురు మాజీ చైర్మన్‌లు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... స్థానిక ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్ ఇతర అధికారుల ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ నిర్వహించినట్లు పేర్కొన్నారు. మొదటి విడతలో ఇళ్లు రాణి నిరుపేదలకు రెండవ విడుతలో ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తారని స్పష్టం చేశారు. ప్రజలు చెప్పుడు మాటలు విని మోసపోవద్దని దళారులను ఆశ్రయించవద్దన్నారు. ఈ వేర్వేరు కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిమి సురేష్, మదిరె సత్యనారాయణ, లాండరి రమేష్, ఆసిఫ్ అలీ, నేత శ్యామ్, వసేఖాన్, రాము, గణేష్, గంగనర్సయ్య, కోమటిపల్లి భీమన్న, ఎడ్ల రాజేందర్, కడకుంట్ల నరసింహులు, తదితరులున్నారు.

కోలూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ

తానూర్ , జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోలూర్ గ్రామంలో శుక్రవారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా తాజా మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఇళ్లు లేని అర్హులైన పేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సహాయం అందించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సురేష్‌పటేల్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు జే. ధర్మేందర్ పాషాభాయ్, నాయకులు మాజీ సర్పంచ్ ఎం.శంకర్, డి. గంగాధర్, గ్రామ పంచాయతీ సెక్రటరీ తిరుపతిరెడ్డి, కారోబారి నర్సారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ పోతన్న గ్రామస్థులు ఉన్నారు.

బీమా చెక్కు అందజేత

దిలావర్‌పూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బన్సపల్లి వ్యవసాయ సహకార సంఘంలో వ్యవసాయ రుణం పొందిన కాల్వ తండాకు చెందిన మెర్వాన్ ఇటీవల మృతి చెందాడు. నామినిగా ఉన్న మృతుడి భార్య లక్ష్మీబాయికి బీమా డబ్బులను చెక్కు రూపంలో పీఏ సీఎస్ చైర్మన్ పీవీ రమణారెడ్డి శుక్రవారం అందజేశారు.

రికార్డులకే పరిమితమైన ఆయుర్వేద వైద్యశాల



సోనాలలో ఖాళీ కుర్చీతో దర్శనమిస్తున్న ఆయుర్వేద ఆసుపత్రి డాక్టర్ గది



ఆయుర్వేద ఆసుపత్రి ఉన్నట్టు సూచిస్తున్న బోర్డు

● ఆసుపత్రి ఉన్నా.. వైద్యుడు, సిబ్బంది కరువు

బోథ్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సోనాల మండల కేంద్రంలో గత 25 సంవత్సరాల క్రితం ఏర్పాటుచేసిన ఆయుర్వేద వైద్యశాలలో డాక్టర్, సిబ్బంది బదిలీ కావడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న ఆయుర్వేద ఆసుపత్రి గదిలో డాక్టర్ లేక ఖాళీ కుర్చే దర్శనమిస్తుంది. ఇందులో పనిచేసే డాక్టర్‌ను అధికారులు కరీంనగర్ జిల్లా బోధన ఆసుపత్రికి బదిలీ చేయగా అటెండర్‌ను వేరే చోటికి బదిలీ చేశారు. దీంతో ఆయుర్వేద ఆసుపత్రిలో డాక్టర్ లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

● రెగ్యులర్ డాక్టర్‌ను నియమించండి

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల డాక్టర్ లేక పోవడంతో ఆసుపత్రికి వచ్చే రోజులు నిరాశతో తిరిగి వెళ్తున్నారు. ప్రాచీన వైద్యం అందుబాటులో ఉంటే ఎంతోమంది వివిధ వ్యాధుల బారిన పడ్డవారు ఆసుపత్రికి వచ్చి పోతుంటారు. అయితే ఆసుపత్రిలో డాక్టర్ లేకపోవడం వల్ల రోగులు నిరాశకు గురవుతున్నారు.

● రెండేళ్ల క్రితం బదిలీ

సోనాల మండల కేంద్రంలో ఉన్న ఆయుర్వేద ఆసుపత్రి డాక్టర్ రెండు సంవత్సరాల క్రితమే బదిలీ అయినట్టు తెలిసింది. బదిలీ అవుతు న్న సందర్భంలో సామగ్రిని సైతం తరలించి వెళ్లేందుకు ఆయుర్వేద ఆసుపత్రి అధికారులు ప్రయత్నించారు. ఆసుపత్రిని తరలించవద్దని అప్పటి సర్పంచ్‌తో పాటు మరికొంతమంది అడ్డుకున్నారు. దీంతో ఆ శాఖ అధికారులు సామగ్రిని విడిచిపెట్టి వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఆసుపత్రిలో డాక్టర్ లేక ఖాళీగానే కనిపిస్తుంది.

● వైద్యుడిని నియమించాలి

వ్యాధులకు శాశ్వత పరిష్కారం లభించే ఆయుర్వేద ఆసుపత్రి పై ఎంతోమంది రోగులు వచ్చి ప్రతిరోజు వైద్యం పొందేవారు డాక్టర్ లేక పోవడం వల్ల వచ్చే రోగులు ఇతర ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు. జిల్లా అధికారులు ఆసుపత్రిలో వైద్యుడిని నియమించినట్లయితే మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు సరైన వైద్యం లభించే ఆస్కారం ఉందని స్థానికులు అంటున్నారు. డాక్టర్‌ను నియమించి సరైన ఆయుర్వేద వైద్యం అందే విధంగా చూడాల్సిన బాధ్యత జిల్లా అధికారులపై ఉంది.



సరస్వతీ అమ్మవారి ఆలయం వద్ద మహా అన్నదానం నిర్వహిస్తున్న గ్రామస్థులు



బాసర అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తున్న గ్రామ పెద్దలు

బాసరలో అన్నదాన ఆచారం

● ఇంటింటా సేకరించిన సరుకులతో గ్రామస్థుల అన్నదానం ● పేద, ధనిక తేడా లేకుండా సమష్టిగా నిర్వహణ ● ఏళ్ల తరబడి కొనసాగుతున్న సంప్రదాయం ● శుక్రవారం పడిన వర్షంతో గ్రామస్థుల సంతోషం

బాసర, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : చదువుల తల్లి సరస్వతీ అమ్మవారు నిలయమైన బాసరలో అన్నదాన ఆచారం కొనసాగుతోంది. గ్రామస్థులందరూ.. సరుకులు పోగు చేసి ఈ కార్యక్రమం చేపడుతున్నారు. గ్రామస్థుల పూర్వీకుల నుంచి వస్తున్న ఈ ఆచారం నేటికి కొనసాగుతుంది. రైతన్నలు పంటలు ప్రారంభించే ఖరీఫ్ సీజన్ కంటే ముందు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ ఏడాది శుక్రవారం ఈ మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వారం రోజుల ముందు గ్రామ పెద్దలు ఇంటింటా తిరిగి వంట సరుకులను విరాళంగా సేకరిస్తారు. పేద, ధనిక అనే బేధం లేకుండా ప్రతి ఇంటిని సంప్రదిస్తారు. ఇచ్చింది. తీసుకొని పోగు చేసి ఆ సురుకులనే అన్నదానానికి వినియోగిస్తారు. ఇలా వారం రోజులు పోగు చేసిన సరుకులను ఒకటోల చేర్చి ఉదయం తెల్లవారు జామున సరస్వతీ అమ్మవారికి అభిషేకం, పూజ నిర్వహించి గ్రామం తరుపున వస్త్రాలను సమర్పించి గ్రామ పెద్దలందరూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం పంటలు పండి అమ్మవారికి నైవేద్యం సమర్పించిన తర్వాత కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ఈ అన్నదానానికి గ్రామంలో ఉన్న ప్రతీ ఇంటి నుంచి హాజరై అన్న ప్రసాదాలను స్వీకరిస్తారు. పేద, ధనిక ఆ కులాల బేధం లేకుండా అన్ని వర్గాల వారు పాల్గొన్ని సంతోషంగా ఈ కార్యక్రమాన్ని సమిష్టిగా నిర్వహిస్తారు. అయితే ప్రతీ సారి వ్యవసాయం కంటే ముందు నిర్వహించే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్యేశ్యంతో ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం పంటలు బాగా పండాలని, పాడి పశువులు ప్రజలు అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం తరరాల నుంచి కొనసాగుతుందని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. ఈ మహా తంతు శుక్రవారం జరగగా పెద్ద సంఖ్యలో బాసర గ్రామస్థులు పాల్గొన్ని అన్న ప్రసాదాలను స్వీకరించారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తుల కూడా అన్నదాన కార్యక్రమానికి హాజరయ్యారు.

శుక్రవారం కురిసిన వర్షంతో ఆనందంలో గ్రామస్థులు

ఈ అన్నదాన ఆచారం నిర్వహించిన రోజున ప్రతీయేడు వర్షాలు తప్పనిసరిగా కురుస్తాయన్నది స్థానికుల్లో ఓ గట్టి నమ్మకం. దీన్ని నిజం చేస్తూ అన్నదానం నిర్వహించిన శుక్రవారం రోజున కూడా బాసరలో వర్షం పడింది. దీంతో గ్రామస్థులందరూ సంతోషంలో మునిగి పోయారు.

పిల్లలతో సరదాగా ఎమ్మెల్యే



భీంపూర్‌లో బాబుతో ఆడుకుంటున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

భీంపూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శుక్రవారం భీంపూర్‌ను సందర్శించినపుడు పిల్లలతో సరదాగా మట్లాడారు. బిస్కెట్‌లు, చాక్లెట్ల కోసం వారికి కొంత డబ్బు ఇచ్చారు. అలాగే గ్రామంలో రైతులు, మహిళల సమస్యలను తెలుసుకుని వారికి భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ శ్రేణులతో ప్రస్తుత పరిస్థితుల గురించి ముచ్చటించారు.

యూరియా కోసం బారులు తీరిన రైతులు



బోథ్ సహకార సంఘం వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

బోథ్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులు యూరియా కొరత వల్ల ఇబ్బందులు గురవుతున్నారు. వర్షాలు కురవడంతో రైతులు ఒకేసారి వరి పంటలకు యూరియా వేసేందుకు యూరియా కోసం వెతుకులాట ప్రారంభించారు. సకాలంలో యూరియా దొరకకపోవడంతో పక్కనే ఉన్న మహారాష్ట్రకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

● వ్యవసాయ అధికారులు స్పందించాలి

యూరియా కొరత విషయమై తక్షణమే వ్యవసాయ అధికారులు స్పందించాల్సిన అవసరం ఉందని రైతులు అంటున్నారు. అధికారులు రైతుల ఇబ్బందులను తీర్చే విధంగా చర్యలు చేపట్టాల్సి ఉంది.

నిర్మల్‌లో ఘనంగా బోనాల జాతర



బోనాల జాతర పాల్గొన్న మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ పట్టణంలోని ఆదర్శ నగర్‌లో బోనాల జాతర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డితో పాటు ధర్మాజీ రాజేందర్ ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్, ఆమెడ శ్రీధర్ మాజీ టెంపుల్ చైర్మన్, శ్రీకాంత్ యాదవ్ వైస్ చైర్మన్, రవి, గజేందర్, వినయ్, రాఘవేందర్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో అకాడీ, వన దేవతలకు ఆదివాసీ పూజలు

● వనంలో సహపంక్తి భోజనాలు చేసిన ఆదివాసీలు

ఇంద్రవెల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రతీ యేట ఆదివాసులు భక్తిశ్రద్ధలతో నిర్వహించే వేడుకల్లో అకాడీ పండుగ ప్రత్యేకమైనది. ఈ పూజలు చేస్తే తమ దేవత పాడిపంటలకు రక్షణ కల్పిస్తుందని ఆదివాసీ గిరిజనుల నమ్మకం. మండలంలోని వాల్గొండ, పోల్లుగూడ గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజనుల ఆధ్వర్యంలో శుక్రవారం వనదేవతకు ప్రత్యేక పూజలు చేశారు. చిన్నాపెద్ద తేడా లేకుండా మొక్కులు చెల్లించారు. వనదేవతకు ఆషాఢ మాసం అకాడి పూజలు నిర్వహించి, నైవేద్యాలు సమర్పించారు. ముందుగా గ్రామ పోలిమేరలోని పోచమ్మతల్లికి పూజలు చేశారు. అనంతరం గిరిజనులు సహపంక్తి భోజనం చేశారు. గ్రామంలోని పశువులను అడవి ప్రాంతంలో వనదేవత చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. గ్రామాల్లో చేను కలుపు పనులు, దండారీ నృత్యాలకు శ్రీకారం చుడుతున్నట్లు, పాడి పంటలు బాగా పండాలని, వన్య ప్రాణులను నుంచి పంటను, పశువులను కాపాడాలని, పిల్లాపాపలను సల్లంగా చూడాలని పూజలు చేసినట్లు గిరిజన పెద్దలు తెలిపారు.



నైవేద్యాలు తయారు చేస్తున్న ఆదివాసీలు (ఇన్‌సెట్‌లో) వన దేవతలు

సమస్యల వలయంలో సారంగాపూర్ బస్‌స్టేషన్

● మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
● ప్రైవేటు వాహనాలకు అడ్డా
● పట్టించుకోని అధికారులు, పాలకులు



నిరుపయోగంగా మారిన ప్రయాణ ప్రాంగణం

సారంగాపూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఇంటికి మరుగుదొడ్డి తప్పనిసరి అని చెప్పే పాలకులు, అధికారులు ప్రయాణికులకు మాత్రం బస్టాండ్‌లో మరుగుదొడ్డి వసతి కల్పించడం లేదు. మండల కేంద్రం గల బస్టాండ్‌లో మరుగుదొడ్లు ఉన్న అవి ఎందుకు పనికి రాకుండా నిరుపయోగంగా మారాయి. దీంతో ప్రయాణికులు ఆరుబయటే అవసరాలు తీర్చుకుంటున్న పరిస్థితి దాపురించింది. ఏళ్లుగా ప్రయాణికులు ఈ అవస్థలు పడుతున్న సంబంధిత అధికారులు, పాలకులు మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సారంగాపూర్ బస్టాండ్ మీదుగా నిత్యం వందలాది మంది ఇతర ప్రాంతాలకు రాకపోకలు కొనసాగించే ప్రయాణికులకు కనీస వసతులు కరువైపోయాయి. బస్టాండు ఆవరణలో మరుగుదొడ్లు, తాగునీటి కుళాయిలు చుట్టు పచ్చి మొక్కలు పెరిగిపోయి దుర్గందభరితంగా దర్శనమిస్తున్నాయి. ప్రయాణికుల వసతులపై దృష్టి సారించాల్సిన అధికారులు మాత్రం కనీసం పట్టించుకోవడం లేదంటున్నారు. పారిశుధ్యం లోపించి ప్రయాణికులను వేధిస్తున్న అటు పాలకులు గాని అధికారులు గాని కనీసం కన్నీటి చూసిన పాపాన పోవడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఈ ప్రయాణ ప్రాంతణం ప్రయివేటు వాహనాలకు అడ్డాగా మరడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికయిన సంబంధిత అధికారులు ఈ విషయంపై దృష్టి సారించి వెంటనే బస్టాండ్‌లో ఉన్నటువంటి మరుగుదొడ్లను శుభ్ర పరిచి బస్టాండ్‌ను పరిశుభ్రపరిచి వాడకంలోకి తీవాలని కోరుతున్నారు.

కరత్వాడ గ్రామంలో సమస్యల తిష్ఠ

● రాత్రిపూట బయటకు వెళ్లాలంటేనే భయం భయం ● అస్తవ్యస్తంగా మురుగు నీటి వ్యవస్థ

బోథ్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కరత్వాడ ప్రాజెక్టు ముంపునకు గురైన కరత్వాడ గ్రామం నూతనంగా ఏర్పాటైన సమస్యలతో సతమతమవుతుంది. గ్రామంలో రోడ్లు, మురికి కాలువలు లేకపోవడంతో పాటు గ్రామంలో గడ్డి పెరగడంతో గ్రామస్తులు పాముల మధ్య సహవాసం చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. గ్రామం పక్కనే చెరువు ఉండడంతో చెరువు వరదల్లో కొట్టుకు వచ్చిన పాములు గ్రామం లోనికి ప్రవేశిస్తున్నాయని గ్రామస్థులు అంటున్నారు.

● రాత్రిపూట బయటకు వెళ్లలేం

ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామంలో పాముల సంచారం పెరిగిందని గ్రామస్థులు వాపోతున్నారు. ఇంటి చు ట్టూ పెరిగిన గడ్డిలో పాములు తిరుగుతున్నాయని అంటున్నారు. గత రెండు రోజుల క్రితం రాత్రిపూట నాలుగు పాములు కాలనీలో తిరగడంతో రాత్రంతా ఇండ్లలో మేలుకొని ఉండాల్సి వచ్చిందని గ్రామస్థులు పేర్కొన్నారు. గ్రామంలో పెరిగిన గడ్డిని తొలగించాలని కోరుతున్నారు.

● నిధులు లేక ఇబ్బందులు పడుతున్న కార్యదర్శులు

గ్రామ పంచాయతీలకు రావాల్సిన బకాయిలు రాక పోవడంతో నిధులు లేక కార్యదర్శులు డీలాపడిపోతున్నారు. ప్రతీ రెండు రోజులకు ఒకసారి గ్రామంలో చెత్త సేకరణ జరిగేందుకు ట్రాక్టర్‌ను తిప్పేవారు. అయితే ట్రాక్టర్లలో డీజిల్ పోయించలేక అనేక గ్రామాలలో వారానికి ఒకసారి మాత్రమే చెత్త సేకరణ కోసం ట్రాక్టర్‌ను తిప్పుతున్నారు. దీంతో గ్రామాలు చెత్తతో నిండిపోతున్నాయి. ఫలితంగా వర్షాకాలం వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉందని గ్రామీణ ప్రజలు ఆందోళన వ్యక్తపరుస్తు న్నారు.

● ముందస్తు ప్రణాళికలు లేక ..

ప్రతీ ఏడాది వర్షాకాలం వ్యాధులు ప్రబలకుండా అధికారులు గ్రామాల కార్యదర్శులతో సమావేశమై వర్షాకాలానికి ముందు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి చర్యలు చేపట్టేవారు. మురికి నీరు ప్రవహించేలా చూడడంతో పాటు దోమల నివారణకు బ్లీచింగ్ పౌడర్ చల్లడం చేసేవారు. అంతేగాక పారిశుధ్య లోపం లేకుండా బోరు బావుల వద్ద బ్లీచింగ్ చల్లేవారు. ఇంకా మురుగునీటి పారుదల వ్యవస్థ సక్రమంగా జరిగే విధంగా చూడాలని ఆదేశించేవారు. గ్రామంలో పెరిగిన గడ్డి తొలగించేందుకు గ్రామాల పారిశుద్ధ సిబ్బందిని అలర్ట్‌గా ఉంచేవారు. అయితే నిధుల లేమితో గ్రామాలు మురికి కూపాలుగా మారుతున్నాయి.



గ్రామంలోని సమస్యలను వివరిస్తున్న మహిళలు

● మురికి కాలువలు లేక ..

కొత్త కరత్వాడ గ్రామంలో మురికి కాల్వల నిర్మాణం చేపట్టక పోవడంతో మురుగు నీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని గ్రామ స్తులు అంటున్నారు. గ్రామంలో మురికి నీరు నిలవకుండా గ్రామ పంచాయతీ వారు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని గ్రామస్థులంటున్నారు.

తైబజార్ వేలం ద్వారా

భైంసా మున్సిపాలిటీకి రూ.12లక్షల ఆదాయం

భైంసా, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో రుసుముల వసూళ్ల కోసం శుక్రవారం నిర్వహించిన తైబజార్ వేలం పాట ద్వారా భైంసా మున్సిపల్ కార్యాలయానికి రూ. 12లక్షల ఆదాయం చేకూరింది. మున్సిపాల్టీలోని కమిషనర్ చాంబర్‌లో వేలం పాట నిర్వహించారు. వేలం పాటల్లో షేక్ ఫిరోజ్, కాసరేల్ల ప్రవీణ్‌లు పాల్గొన్నారు. పోటాపోటీగా జరిగిన వేలం పాటల్లో అధిక వేలం పాట పాడిన షేక్ ఫిరోజ్ రూ. 12లక్షలతో తైబజార్ నిర్వాహణను దక్కించుకున్నాడు. శనివారం నుంచి వచ్చే సంవత్సరం మార్చి 31 వరకు సంబంధిత రుసుముల వసూళ్లకు అనుమతి ఉండనుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రాజేష్ కుమార్ మాట్లాడుతూ నిర్దేశిత ధరల ప్రకారం తైబజార్ రుసుములను వసూలు చేయాలని, నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



మున్సిపల్ కార్యాలయంలో తైబజార్ వేలం పాట నిర్వహిస్తున్న కమిషనర్ రాజేష్ కుమార్

● బీజేపీ పట్టణ కమిటీ ఒత్తిడితోనే వేలం పాట, రూ. 9.49లక్షల అదనపు ఆదాయం

పట్టణ పరిధిలో తైబజార్ నిర్వాహణకు గాను వేలం పాట నిర్వహించాని బీజేపీ భైంసా పట్టణ కమిటి గత కొంత కాలంగా జిల్లా కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికార యంత్రాంగానికి ఫిర్యాదు చేస్తు వచ్చింది. బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు యనుపోతుల మల్లేశ్వర్ సంబంధిత విషయాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని వేలం పాట నిర్వహించే దిశగా అధికారులపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తీసుకవచ్చారు. దీనికి తోడు పట్టణ కమిటి అధ్యక్షులు రావుల రాము సైతం కార్యవర్గ సభ్యులతో కలిసి అధికారులకు పదేపదే ఫిర్యాదు చేశారు. ఇందుకు స్పందించిన అధికారులు శుక్రవారం వేలం పాటను నిర్వహించారు. ఇందులో రూ. 12లక్షలతో ఇది వరకు తైబజార్ నిర్వహిస్తున్న షేక్ ఫిరోజ్ దక్కించుకున్నాడు. గత సంవత్సరం నామమాత్రపు పెంపుతో కొనసాగిన తైబజార్ వేలం పాట బీజేపీ ఒత్తిడి మేరకు బహిరంగ వేలం పాట కొనసాగింది. ఈ క్రమంలో రూ. 2.51లక్షలతో కొనసాగిన గత సంవత్సరం తై బజార్ ఈ సంవత్సరం రూ. 9.49లక్షల అదనపుతో రూ. 12లక్షలకు ఖరారైంది. బీజేపీ పట్టణ కమిటి ఒత్తిడి మేరకు మున్సిపాల్టీకి రూ. 9.49 లక్షల అదనపు ఆదాయం చేకూరింది.

రోడ్డుపైనే పారుతున్న మురికి నీరు

● ఇబ్బందులు పడుతున్న ప్రజలు



బోథ్ సమీపంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

బోథ్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సమీపంలో ఆదిలాబాద్ నిర్మల్ వెళ్లే రహదారిపై మురికి నీరు ప్రవహిస్తుందని, ఫలితంగా రోడ్డుపై నడిచే పాదాచారులు, ద్విచక్ర వాహనాల వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నూతనంగా నిర్మించుకున్న ఇళ్లలో నుంచి మురికి నీరు మురుగు కాలువకుండా దాదాపు 500 మీటర్ల దూరం ప్రవహించిన అనంతరం అక్కడి నుంచి నీరంతా రోడ్డుపైకి వస్తుంది. ఫలితంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

● చిన్నపాటి నిర్లక్ష్యం

ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చిన అధికారులు మురుగునీటి కాలువలు ఎటువైపు వెళ్తాయి వెళ్లిన వైపు మురికి కాలువ ఉందా అనే దాన్ని చూడకుండా అడ్డగోలుగా అనుమతులు ఇవ్వడం జరిగింది. అయితే ఇళ్లలోని వారు వాడిన మురికి నీరంతా రోడ్లపైకి వస్తుండ డంతో దుర్గంధంగా మారింది. అంతేగాక లక్షలాది రూపాయలతో నిర్మిం చిన రోడ్డు సైతం గుంతల మయంగా మారింది. రోడ్డు పక్కన వ్యాపా రాలు నిర్వహించుకునేవారు మురికి కాలువలను ఏర్పాటు చేసుకోకుం డా వ్యాపారాలు నిర్వహిస్తుండడంతో ఈ దుస్థితి నెలకొందని మండల ప్రజలు పేర్కొంటున్నారు. అధికారులు ఈ విషయమై తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

బురదమయంగా అంతర్రాష్ట్ర రహదారి

● అవస్థలు పడుతున్న ప్రజలు, ప్రయాణికులు

ఇచ్చోడ, జూన్27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం మీదగా బజార్ హత్నూర్, సోనాల మండలాల మీదుగా వెళ్లే అంతర్రాష్ట్ర రహదారిపై ఉన్న గ్రామాల్లో రోడ్లు బురదమయం కావడంతో పాదాచారులతో పాటు వాహన చోదకులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. పలు చోట్ల రోడ్లపై నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. మండలంలోని అడేగామ(కె) గ్రామంలో అంతరాష్ట్ర రహదారిపై నీరెళ్లే దారి లేక రోడ్లపై మడుగులు గా మారాయి. నిత్యం వేల సంఖ్యలో వాహనాలు ఈ దారి గుండా పయణిస్తున్న పట్టించుకునే నాథుడే కరువయ్యాడని గ్రామస్థులు పేర్కొంటున్నారు. వర్షాకాలం వస్తే చాలు నీటి గుండాలు, బురద కూపాలతో కాలం వెళ్లదీయాల్సి వస్తుందే తప్ప అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్థులు వాపోతున్నారు.



అడేగామ(కె)లో అవస్థలు పడుతున్న ప్రయాణికులు

పాస్‌పోర్టు పోయినది

నేను BHEEMANWAR SRIKANTH S/O GAJJARAM, R/O H.NO. 6-183/1, SIRPELLY VILLAGE, MANDAL: KUBEER, DIST. NIRMAL,TELANGANA, నాయొక్క పాస్‌పోర్టు నెం U6729232 గల పాస్‌పోర్టు తేది 16.05.2025 రోజున సిర్పెల్లి గ్రామం నుండి బైక్‌పై కుభీర్ మండలం మరియు కుభీర్ మార్కెట్ ప్రాంతానికి ప్రయాణించగా ఎక్కడో పడిపోయినది. దొరికినవారు ఈ క్రింది నెంబరుకు తెలియజేయగలరు. Cell: 8367297622

వేడుక ఏదైనా.. సందర్భం ఎటువంటిదైనా
☛ వివాహ వార్షికోత్సవం
☛ స్వదేశీ, విదేశీయానం
☛ లీగల్ ప్రకటనలు
☛ పదవీ విరమణ
☛ శ్రద్ధాంజలి
☛ జన్మదినం
☛ షష్టిపూర్తి
☛ జయంతి
☛ వర్ధంతి
☛ క్లాసిఫైడ్స్



మీ స్నేహితులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులకు ఆంధ్రజ్యోతిలో ప్రకటనల ద్వారా అతి తక్కువ రేట్లకే శుభాకాంక్షలు తెలియజేయండి

ఆంధ్రజ్యోతి
ప్రకటనల కొరకు సంప్రదించండి
ఆదిలాబాద్: 99854 11291
నిర్మల్ : 80966 77672
యాడ్స్ మేనేజర్ : 99854 11453



● గుడిహత్నూర్ మండలంలో రౌండప్ మందును పిచికారీ చేయడంతో ఎరుపుబారి కనిపిస్తున్న పంట చేను



వద్దన్నా.. వాడుతున్నారు!

- జిల్లాలో యథేచ్ఛగా నిషేధిత రౌండప్ మందుల వాడకం
- ప్రభుత్వం నిషేధించినా.. గుట్టుచప్పుడు కాకుండా అమ్మకాలు
- కూలీల కొరతతో కలుపు నివారణకు రౌండప్ మందుల స్ప్రే
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

ఆదిలాబాద్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పర్యావరణ ముప్పుతో పాటు నేల సారాన్ని దెబ్బతీసే నిషేధిత గడ్డి మందులను వద్దన్న రైతులు యథేచ్ఛగా వాడుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వం గ్లైఫోసైట్ గడ్డి మందులను పూర్తిగా నిషేధించింది. కానీ జిల్లాలో కొందరు వ్యాపారులు విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. వానాకాలం సీజన్‌లో ప్రధానంగా పత్తి, సోయా, కంది, జొన్న, మినుము, పెసర పంటలను ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంటలను కలుపు మొక్కలు కప్పేస్తున్నా యి. దీంతో పంటలలో కలుపు మొక్కల నివారణకు నిషేధిత గడ్డి మందుల వాడకం పెరిగి పోతోంది. ఈ మందుల వాడకం ముప్పని తెలిసినా.. తప్పడం లేదంటున్నారు. జిల్లాలో రైతులందరూ ఏకకాలంలోనే పంటల సాగు పనులను మొదలు పెట్టడంతో కలుపు నివారణ కష్టసాధ్యంగా మారింది. యేటా కూలీల కొరత పెరిగిపోవడంతో సులువుగా పంటలను సాగు చేసేందుకు రైతులు ప్రత్యామ్నాయంగా రౌండప్ మందులను స్ప్రే చేస్తూ కలుపును నివారిస్తున్నారు. ఇటీవల మహారాష్ట్రలోని బోదిడి నుంచి గుడిహత్నూర్ మండలానికి 30 రౌండప్ మందుల బాటిళ్లను సరఫరా చేస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేయడం ఆందోళన రేపుతుంది. 'దొరికితే దొంగ.. లేదంటే దొర' అన్నచందంగా జిల్లాలో రౌండప్ మందుల వాడకం కనిపిస్తుంది. కానీ అత్యంత ప్రమాదకరమైన గ్లైఫోసెట్ రసాయనాలతో జీవా వర్గంతో పాటు పర్యావరణానికి ప్రమాదం పొంచి ఉన్నా.. కట్టడి చేయడంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు నిండు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

రైతుల్లో అవగాహన కల్పిస్తున్నాం

: శివకుమార్, ఏడీఏ, ఆదిలాబాద్

నిషేధిత గడ్డి మందుల వాడకంపై రైతుల్లో అవగాహన కల్పిస్తున్నాం. గ్లైఫోసేట్ గడ్డి మందుపై పూర్తిగా నిషేధం ఉంది. దీంతో నేల సారం దెబ్బతినడంతో పాటు పర్యావరణానికి ముప్పు కలుగుతుంది. మండల స్థాయి అధికారులు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి రౌండప్ మందులతో తలెత్తే పరిణామాలపై హెచ్చరికలు చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో గడ్డి మందులను వాడరాదంటూ వ్యవసాయ శాస్త్రవేత్తలు కూడా చెబుతున్నారు. సులువుగా కలుపు నివారణ చేసే అవకాశం ఉండడంతో రైతులు నిషేధిత గడ్డి మందులను వాడుతున్నారు. రౌండప్ మందులను విక్రయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాం.

సరిహద్దుల్లో నిఘా కరువు

జిల్లా సరిహద్దుల్లో అధికారుల నిఘా కరువవడంతో పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి నిషేధిత గడ్డి మందులతో పాటు అక్రమ వ్యాపారానికి అడ్డూఅదుపు లేకుండా పోతోంది. కొందరు వ్యాపారులు గుట్టుచప్పుడు కాకుండా మహారాష్ట్ర నుంచి గడ్డి మందులను తీసుకొచ్చి అమ్మేసుకుంటున్నారు. జిల్లాలో ఈ మందులపై నిషేధం ఉండడంతో మహారాష్ట్ర నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుంటున్న వ్యాపారులు.. గుట్టుచప్పుడు కాకుండా అంటగడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. మహారాష్ట్ర సరిహద్దుల్లోని తలమడుగు, బోథ్, తాంసి, బీంపూర్, జైనథ్, బేల, నార్నూర్, గుడిహత్నూర్ మండలాల్లో జోరుగా రౌండప్ మందుల వాడకం కొనసాగుతునట్లు తెలుస్తుంది. ప్రమాదకరమైన రౌండప్ మందుల వాడకాన్ని కట్టడి చేయకుంటే భవిష్యత్తులో విపరీతమైన పరిణామాలు ఉంటాయని నిపుణులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా గడ్డి మందుల పేరిట రౌండప్, ఆల్‌క్లియర్, గరుడ, గ్లిసెల్ లాంటి నకిలీ పేర్లతో విక్రయాలు జరుపుతున్నారు. తక్కువ ఖర్చుతో అధికంగా కలుపు ను నివారించే అవకాశం ఉండడంతో



● నిషేధిత రౌండప్ గడ్డి మందు బాటిల్

(తరువాయి 6వ పేజీలో...)


జలధారలతో కొర్టికల్ జలపాతం ఇలా..

కనువిందు చేస్తున్న కొర్టికల్ జలపాతం

నేరడిగొండ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్టికల్ గ్రామ సమీపంలోని జలపాతం జలధారలతో కనువిందు చేస్తోంది. జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఈ జలపాత అందాలను ఆస్వాదిస్తూ వాహనదారులు, ప్రకృతి ప్రేమికులు మంత్రముగ్ధులవుతున్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

తాంసి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వర్షాకాలమైనందున పరిసరాల పరిశుభ్రతపై ప్రతీఒక్కరు దృష్టి పెట్టాలని మండల వైద్య బృందం ప్రజలకు సూచించారు. శుక్రవారం బండలనాగపూర్, అట్నంగూడ గ్రామాల్లో వైద్య బృందం పర్యటించింది. ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. మురికినీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా ఏవైనా వ్యాధులు సోకితే వెంటనే ప్రభుత్వ వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్ వాయిసార్ తులసీరామ్, లక్ష్మి, పద్మ, అరుణ, తదితరులు ఉన్నారు.


ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు భూమారెడ్డి

మత సామరస్యానికి ప్రతీక మొహరం

● రుయ్యాడీలో మొహరం ఉత్సవాలు ప్రారంభం

తలమడుగు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీక మొహరం పండుగని విజయ డెయిరీ మాజీ చైర్మన్, హస్సన్ హస్సేన్ దర్గా అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు లోక భూమరెడ్డి అన్నారు. మండలంలోని రుయ్యడి గ్రామంలో మొహరం పండుగ ఉత్సవాలను ఆయన ప్రారంబించారు. ఆయన మాట్లాడుతూ అమావాస్య తర్వాత దర్శనమిచ్చే నెలవంకను చూసి ఉత్సవాలను ప్రారంబిస్తామన్నారు. రుయ్యాడి పీరీలకు ఘనమైన చరిత్ర ఉందన్నారు. నమ్ముకున్న వారికి నమ్ముకున్నంతగా హస్సన్ హస్సేన్ పీరీలా ఆశీస్సులు లభిస్తాయన్నారు. అదే విధంగా ఈ పండుగను 15 రోజులపాటు భక్తిశ్రద్ధలతో ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవడం జరుగుతుందన్నారు. ఉత్సవాల్లో భాగంగా జూలై 5, 6, 7వ తేదీల్లో ప్రత్యేక కార్య క్రమాలు ఉంటాయన్నారు. అనంతరం హస్సన్ హస్సేన్ ఆలయం ముందర గుండం తీసి ఉత్సవాలను ప్రారంబించారు. ఇందులో ఆలయ కమిటీ సభ్యులు మోతె శ్రీనివాస్, నరేందర్ రెడ్డి, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

అర్హులకు రుణమాఫీ సంగతి ఏమిటి?

బీంపూర్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ విషయంలో అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయలేదు అని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. భీంపూర్‌లోని రైతువేదికలో తహసీల్దార్ నలందప్రియ, నాయకులతో కలిసి 32 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. తరువాత మొక్కలు నాటారు. భీంపూర్‌లో రూ.ఐదు లక్షల అంచన వ్యయంతో సవారీ బంగ్లా కోసం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ అమలు చేసిన కల్యాణలక్ష్మి పథకం దేశంలో ఎక్కడా లేదన్నారు. కల్యాణలక్ష్మీ, షాదీముబారక్‌తో పాటు పాటు తులం బంగారం ఇస్తామన్న కాంగ్రెస్ సర్కారు హామీని నిలబెట్టుకోలేదు అని పేర్కొన్నారు. ఇందులో బీఆర్ఎస్ మండల కన్వీనర్ మేకల నాగయ్య, మాజీ జడ్పీటీసీ కుంరా సుధాకర్, వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్న, పలువురు నాయకులు, తదితరులున్నారు.

'అగ్నివీర్ పరీక్షకు హాజరుకండి'

బోథ్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోల్జర్స్ గ్రూప్ ఆధ్వర్యంలో అగ్నివీర్, ఆర్మీ ఉచిత మాక్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు మాసం అనిల్ తెలిపారు. ఆదివారం రోజున నిర్వహించనున్న ఈ మాక్ టెస్ట్ కోసం నియోజకవర్గ పరిధిలోని ఆసక్తి గల అభ్యర్థులు హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు ఫోన్ నెం. 9533650208, 9492622956 ద్వారా సంప్రదించాలని ఆయన కోరారు.

సమస్యల పరిష్కారానికి ప్రజా వేదిక

తలమడుగు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకే ప్రతినెలా ప్రజావేదిక నిర్వహిస్తున్నామని మార్కెటింగ్ శాఖ ఏడీ, మండల ప్రత్యేక అధికారి గజానన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన నాలుగవ విడత ప్రజావాణి ప్రజావేదికలో ఆయన మాట్లాడారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల్లో అర్హులైన లబ్ధిదారులకు రాకుంటే వాటిని పరిష్కరించేందుకు ప్రజావేదికలో చర్యలు చేపడుతున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా వ్యవసాయ పనులు ఊపందుకున్న నేపథ్యంలో అర్జీదారులు ఎవరూ లేక వేదిక ఖాళీ కుర్చీలతో దర్శనమిచ్చింది. ఇందులో ఎంపీడీవో చంద్రశేఖర్, మండల వ్యవసాయ అధికారి ప్రమోద్‌రెడ్డి, తహసీల్దార్ రాజమోహన్, ఎంపీవో వినోద్ కుమార్, ఎలక్ట్రిసిటీ ఏఈ శ్రీనివాస్, ఏపిఓ మేఘమాల, సీనియర్ అసిస్టెంట్ నగేష్, రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి : డీఈ

నేరడిగొండ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా రైతులు జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ శాఖ డీఈ ఈదన్న అన్నారు. శుక్రవారం మండలంలోని వాంకిడి గ్రామంలో గల పలువురు రైతుల పంట పొలాల్లో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షాకాలంలో రైతులు విద్యుత్ మోటార్ల వద్ద విద్యుత్ తీగలను తాకవద్దని, అత్యవసర సమయంలో 1912కు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ ఏడీఈ లక్ష్మణ్, నేరడిగొండ ఏఈ నాగేంద్రప్రసాద్, లైన్ ఇన్స్‌పెక్టర్ రాంమోహన్ రావు, లైన్‌మన్ మురళి, ఏఎల్ఎంలు అరుణ్, జాలం సింగ్ తదితరులు ఉన్నారు.

ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

● జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ● రిమ్స్ ఆసుపత్రిలో పారిశుధ్యం సరిగ్గా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని జిల్లా ఇన్‌చార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం రిమ్స్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలపై డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో పారిశుధ్యం సరిగ్గా లేకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుధ్య కాంట్రాక్టర్ మాట వినకపోతే తొలగించాలన్నారు. అనంతరం ఓపీలో వైద్యులతో మాట్లాడి రోగుల వివరాలను తెలుసుకున్నారు. రోగులకు ఇబ్బంది లేకుండా వైద్య సేవలు అందించాలని సూచించారు. అదే విధంగా రిమ్స్‌కు వచ్చే రక్తహీనత వారి వివరాలను తెలుసుకుని రిజిస్ట్రర్లను పరిశీలించారు. అంతకుముందు రిమ్స్ సందర్శనకు వచ్చిన మంత్రిని డైరెక్టర్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లికృష్ణారావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు ఎక్కువ శాతం పేద రోగులే వస్తారన్నారు. వారికి పరిశుభ్రమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందన్నారు. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడాన్ని తన సందర్శనలో గుర్తించడం జరిగిందన్నారు. రోగులకు మంచి వాతావరణంతో పాటు నాణ్యమైన వైద్యం అందిస్తామన్నారు. వైద్యులు కూడా సమర్థవంతంగా పని చేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇందులో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్, ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్, కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్, డీఎఫ్ఓ ప్రశాంత్ బాజీరావు పాటిల్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి, అజ్మీరా శ్యాంనాయక్, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


● రిమ్స్‌లో రోగులకు అందుతున్న సేవల గురించి డైరెక్టర్‌ను అడిగి తెలుసుకుంటున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి

● మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా 5కేరన్

ఆదిలాబాద్ అర్బన్: జీవితం విలువైనది, చిన్నది దానిని నలుగురికి ఉపయోగపడేలా జీవించాలని దీన్ని చెడు వ్యసనాల కోసం నాశనం చేసుకోవద్దని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం పోలీసుల ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా 5కేరన్‌ను నిర్వహించారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి ప్రారంభమైన రన్‌ను మంత్రితో పాటు కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఎమ్మెల్యేలు పాయలశంకర్, వెడ్మబొజ్జుపటేల్‌లు ప్రారంభించారు. రన్‌లో పాల్గొని డ్రగ్‌కు వ్యతిరేకంగా ప్రతీఒక్కరు ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సైకిళ్లను బహుమతులుగా, 5కే రన్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్‌లను అందజేశారు. ఇందులో కలెక్టర్ రాజార్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్, డీఎఫ్ఓ ప్రశాంత్ బాజీరావుపాటిల్, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్, ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, ట్రాఫిక్ పోలీసులు పట్టణ పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

ఆదిలాబాద్ అర్బన్: వ్యాపారుల విజ్ఞప్తి మేరకు అంబేద్కర్‌చౌక్ వద్ద ఇటీవల వీధి వ్యాపారులను తొలగించిన ప్రాంతాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. అక్కడ వ్యాపారం చేసుకునే వారు వారి బాధలు మంత్రికి వెల్లబోస్తు రోధించారు. ఇదేక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పాయల శంకర్‌ల మధ్య స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో మంత్రి కలుగజేసుకుని ఇరువురిని శాంతిపచేశారు. అనంతరం వీధి వ్యాపారుల సమస్య పరిష్కారానికి అధికారులు, పోలీసులు సమావేశమై తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.


జెండా ఊపి 5కే రన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

● పర్యాటక అభివృద్ధికి కృషి

మావల: జిల్లా పర్యాటక అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు పేర్కొన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మావల హరిత వనంలో ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లతో కలిసి మొక్కలు నాటారు. అంతకు ముందు టూరిజంపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను వీక్షించారు. అనంతరం ఒక పలు అభివృద్ధి పనులను ప్రారంభించి మాట్లాడారు.

తలతిక్క పనుల వల్లే తిరస్కారం

● నా ఫోన్‌ను కూడా గత ప్రభుత్వం ట్యాప్ చేసింది :జూపల్లి

ఆదిలాబాద్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ వంటి తల తిక్క పనులు చేయడం వల్లే గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించారని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో పూర్తిగా విధ్వంసం, ఏకచత్రాధిపత్యం జరిగిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బిహార్, యూపీకి నిధులు ఇస్తున్నట్లుగా తెలంగాణకు ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన అందిస్తోందన్నారు. అందువల్ల 'స్థానిక' ఎన్నికలు ఎప్పుడొచ్చినా.. కాంగ్రెస్‌దే విజయమని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో మంత్రులకు కూడా ప్రగతి భవన్ గేట్లు తెరుచుకునేవి కాదని, అక్కడి వరకు వెళ్లి తిరిగి వచ్చే పరిస్థితి ఉండేదన్నారు. ఉమ్మడి రాష్ట్రాన్ని 22మంది సీఎంలు పాలించిన సమయంలో రాష్ట్ర అప్పు రూ. 75వేల కోట్లు ఉంటే.. గత పదేళ్ల కాలంలో ఏకంగా రూ. 8లక్షల కోట్లకు చేరిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో తన ఫోన్‌ను కూడా ట్యాప్ చేశారన్నారు. ఫోన్ ట్యాపింగ్‌లు చేయడం ఆదర్శ పాలన ఎలా అవుతుందని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు ఇతర అంశాల్లో కూడా గత ప్రభుత్వ పాలనలో ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారని అన్నారు. కాళేశ్వరం విచారణ కమిషన్‌కు ప్రభుత్వం అవసరమైన రికార్డులను అందిస్తుందని పేర్కొన్నారు. తెలంగాణకు బీజేపీ ప్రభుత్వం చేసిందేమీ లేదని, అందువల్ల కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు ఆ పార్టీ నేతలకు లేదన్నారు. తెలంగాణలోని ఏ ప్రాజెక్టుకు కూడా జాతీయ హోదా ఇవ్వలేదని విమర్శించారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. హామీలను సీఎం రేవంత్‌రెడ్డి నెరవేరుస్తున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో ఉమ్మడి జిల్లా రాజకీయ ముఖచిత్రాన్ని మారుస్తామని తెలిపారు. ఎమ్మెల్సీ దండె విఠల్, సీనియర్ నాయకులు వేణుగోపాలచారి, ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి, తదితరులున్నారు.

విద్యా రంగంలో సమస్యలు పరిష్కరించాలి

● పీఆర్టీయూ ఆధ్వర్యంలో డీఈవోకు వినతిపత్రం

మావల, జూన్ 27(ఆంధ్రజ్యోతి): విద్యా రంగంలో నెలకొన్న పలు సమస్యలు అన్నింటినీ పరిష్కరించాలని డీఈవో శ్రీనివాస్‌రెడ్డికి పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. దీనిలో భాగంగా తెలంగాణ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు విఠల్ గౌడ్ జిల్లా పీఆర్‌టీయూ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నూర్‌సింగ్, నర్ర నవీన్‌యాదవ్‌లతో కలిసి వినతిపత్రం అందజేసి సమస్యలను డీఈవోకు విన్నవించారు. ఇందులో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జాదవ్ ప్రకాష్, జిల్లా కోశాధికారి ముజీబ్, తదితరులు పాల్గొన్నారు.


డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న పీఆర్టీయూ సంఘ నాయకులు

వయో వృద్ధుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా దేవిదాస్ దేశ్ పాండే



తాంసి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): సంఘం జిల్లా అధ్యక్షుడిగా మరోసారి దేవిదాస్ దేశ్ పాండేను ఎన్నుకున్నారు. శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో సభ్యులంతా ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో ఈ ఎన్నికను నిర్వహించారు. గత మూడేళ్ల నుంచి వయోవృద్ధుల కోసం చేస్తున్న కృషిని అభినందించారు. అధ్యక్షుడు దేవిదాస్ దేశ్ పాండేతో పాటు పలువురు సభ్యులను కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో వృద్ధులు సైతం పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వయవృద్ధుల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని దేవిదాస్ దేశ్ పాండే పేర్కొన్నారు. ఏ అవసరం వచ్చిన తమను సంప్రదించాలని కోరారు.

● వయోవృద్ధుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు

తాంసి: వయోవృద్ధుల సంక్షేమం కోసం తమ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని వయోవృద్ధుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దేవిదాస్ దేశ్‌పాండే అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వయోవృద్ధుల సంక్షేమంపై ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అంతా బురదమయం!

● ఇచ్చోడలో బురదమయంగా మారిన అంతర్ రాష్ట్ర రహదారి
● తీవ్ర అవస్థలు పడుతున్న స్థానికులు, వచ్చిపోయే ప్రయాణికులు



7లో

రికార్డులకే పరిమితం!

● సోనాలలో రికార్డులకే ఆయుర్వేద వైద్యశాల పరిమితం
● ఆసుపత్రి ఉన్నా.. వైద్యుడు, సిబ్బంది కరవు
● స్థానికుల ఇక్కట్లు



7లో